క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో స్కంధ షష్ఠి పూజలు

సత్యవేడు: స్థానిక వీరభద్రస్వామి ఆలయంలోని ఉపాలయం సుబ్రహ్మణ్యస్వామి మందిరంలో గురువారం స్కంధషష్ఠి పూజలను భక్తిశ్రద్ధలతో నిర్వహించినట్లు అర్చకులు తెలిపారు. ఉదయం వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామికి విశేష పూజలు చేశారు. అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. తర్వాత స్వామి వారి కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు.అర్చకులు బాలా జీ దేవర్, బండారు సుబ్రమణ్యం, కాట్న మోగీశ్వరయ్య, ఆలయ నిర్వాహకులు ఇందూరు రవికుమార్ దేవర్ పాల్గొన్నారు.

మత్తుకు జీవితాలు చిత్తు

బుచ్చినాయుడుకండ్రిగ: మత్తుకు బానిసైతే జీవితాలు నాశనమవుతాయని బుచ్చినాయుడుకండ్రిగ సీఐ తిమ్మయ్య తెలిపారు. బుచ్చినాయుడు కండ్రిగలోని శ్రీనివాసతేజ ప్రైవేటు పాఠశాల విద్యార్థులకు గురువారం గంజాయి, డ్రగ్స్ మత్తు పదార్థాల వినియోగంవల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ యువకులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. మహిళలపై అత్యాచారాలు, సైబర్ నేరాలు జరగకుండా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఎస్ఐ విశ్వనాథనాయుడు ట్రాఫిక్ రూల్స్‌పై అవగాహన కల్పించారు.

వేరుశనగ, మినుము విత్తనాల పంపిణీ


విత్తనకాయలు పంపిణీ చేస్తున్న ఆదిమూలం

నారాయణవనం: మండలంలోని రైతులకు సబ్సిడీపై వేరుశనగ, మినుము విత్తనాలు అందజేస్తున్నట్టు సత్యవేడు ఎమ్మెల్యే ఆదిమూలం, ఎంపీపీ దివాకర్‌రెడ్డి తెలిపారు. పాలమంగళం దక్షిణపుకండ్రిగ రాముల వారి ఆలయం వద్ద జరిగిన కార్యక్రమంలో ఆదిమూలం పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ పంట ఉత్పత్తులను ప్రభుత్వం నేరుగా కొనుగోలు చేసి రైతులు దళారుల బారినపడకుండా ఆదుకుంటుందన్నారు. వ్యవసాయశాఖ ఏడీ రమేష్ మాట్లాడుతూ పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్ కార్డుతో రైతు సేవా కేంద్రాల సిబ్బందిని సంప్రదించాలని సూచించారు. ఏఓ శోభారాణి, నేతలు రాజారెడ్డి, మాణిక్యంరెడ్డి పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

నాగలాపురం: దీర్ఘకాలికంగా నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని 104 సిబ్బంది కోరారు. వారు గురువారం ఎంపీడీఓ బాలాజీనాయక్, డీటీ లావణ్యకు వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ తాము 16 ఏళ్లుగా ప్రజలకు సేవలు అందిస్తున్నామన్నారు. గతంలో ప్రభుత్వం ఆధీనంలో పనిచేస్తున్న తమను అరబిందో యాజమాన్యానికి అప్పగించారని తెలిపారు. తక్కువ వేతనంతో కుటుంబ పోషణ కష్టంగా ఉందని, వేతనాలు పెంచడంతోపాటు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. అనంతరం 14 రోజులు నిరసన కార్యక్రమాలు చేపడుతున్నట్టు లేఖ అందజేశారు.

విద్యుత్ స్తంభానికి మరమ్మతులు

సాక్షి ఎఫెక్ట్..

బుచ్చినాయుడుకండ్రిగ : గత నెల తుపాను కారణంగా కురిసిన భారీ వర్షాలకు కనమనంబేడులోని పొలాల్లో విద్యుత్ స్తంభం కూలిపోయింది. దీనిపై బుధవారం ట్రాన్స్‌కో నిర్లక్ష్యం.. రైతులకు శాపం అన్న శీర్షికన సాక్షి దినపత్రికలో కథనం ప్రచురితమైంది. దీంతో స్పందించిన ట్రాన్స్‌కో ఏఈ చలపతి స్తంభాన్ని సరిచేయించి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు.

వ్యక్తికి ఏడాది జైలు శిక్ష

నాగలాపురం: ఘర్షణ కేసులో పిచ్చాటూరు మండలం వెంగళత్తూరు గ్రామానికి చెందిన చొక్కలింగం కుమారుడు ఉమాపతి (44)కి ఏడాది జైలు శిక్ష విధిస్తూ సత్యవేడు కోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. వెంగళత్తూరుకు చెందిన జయచంద్ర గొర్రెలు మేపుకుంటూ ఉంటాయి. అవి 2019లో ఉమాపతికి చెందిన ఖాళీ జాగాలోకి వెళ్లాయి. దీనిపై అతను ఆగ్రహం వ్యక్తం చేస్తూ జయచంద్రపై దాడి చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్ఐ వెంకటేశ్వర్లు కేసు నమోదుచేశారు. జడ్జి గోపాలకృష్ణ కేసు పూర్వాపరాలను విచారించారు. ఉమాపతిపై నేరం రుజువు కావడంతో గురువారం ఏడాది జైలు శిక్ష విధించారు. నిందితుడిని ఎస్ఐ వెంకటేశ్వర్లు, పోలీసు సిబ్బంది చిత్తూరు జిల్లా జైలుకు తరలించారు.

బాధ్యతల స్వీకరణ

నారాయణవనం: పుత్తూరు రూరల్(నారాయణవనం) సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా రవీంద్ర గురువారం సాయంత్రం బాధ్యతలు తీసుకున్నారు. ఇక్కడ పనిచేస్తున్న భాస్కర్ నాయక్ తిరుపతి ట్రాఫిక్‌కు బదిలీ అయ్యారు. అక్కడ పనిచేస్తున్న రవీంద్ర బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ సర్కిల్ పరిధిలోని నారాయణవనం, పిచ్చాటూరు, కేవీబీపురం, వడమాలపేట మండలాల్లో శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తానన్నారు.

నిందితుడి అరెస్ట్

శ్రీకాళహస్తి : హత్యాయత్నం కేసులో నిందితుడు నాదమునికుమార్ (పిచ్చి ముని)ని ఒకటో పట్టణ సీఐ గోపి అరెస్ట్ చేశారు. పట్టణంలోని జెట్టిపాళెంలో ఈనెల 4వ తేదీ సతీష్, అతని భార్య కీర్తన, మామ గణేష్‌పై హత్యాయత్నం జరిగింది. ఈ కేసులో ముద్దాయి అయిన నాదమునికుమార్‌ని సన్నిధి వీధిలోని టూరిజం బస్టాండ్ వద్ద గురువారం అరెస్ట్ చేసినట్టు సీఐ తెలిపారు. అతడి వద్ద నుంచి నేరానికి ఉపయోగించిన కత్తి, ఆటోను స్వాధీనం చేసుకున్నట్టు వెల్లడించారు.

విద్యార్థినులకు తర్ఫీదునిస్తున్న క్రాఫ్ట్ టీచర్



ప్రదర్శిస్తున్న విద్యార్థినులు





- వ్యర్థాలతో ఆకట్టుకునే బొమ్మలు తయారు చేస్తున్న రేణిగుంట బాలికోన్నత పాఠశాల విద్యార్థినులు
- జిల్లా స్థాయి పోటీల్లో మొదటి బహుమతి

కాదేదీ వ్యర్థం .. సృజనతో అద్భుతం



రేణిగుంట: 'విద్యార్థినుల్లో దాగి ఉన్న సృజనకు పదునుపెట్టి వారిలోని సహజ సామర్థ్యాన్ని అద్వితీయంగా మలుస్తున్నారు. చదువు..ఆటలే కాదు.. సహ పాఠ్య కార్యక్రమాల్లోనూ రేణిగుంట బాలికోన్నత పాఠశాల విద్యార్థినులు తమదైన శైలిలో ఆకట్టుకుంటున్నారు. ఇక్కడ పనిచేస్తున్న ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ టీచర్ వారికి సరైన తర్ఫీదునిచ్చి వారి పడేసిన వ్యర్థ వస్తువుల నుంచి అబ్బురపరిచే బొమ్మలను తయారుచేస్తూ ప్రశంసలు, అవార్డులను అందుకుంటూ శభాష్ అనిపించుకుంటున్నారు. స్వచ్ఛతా హీ సేవ-2024 కార్యక్రమంలో భాగంగా గత నెలలో తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్‌లో నిర్వహించిన వేస్ట్ టూ ఆర్ట్ అండ్ వేస్ట్ టు వండర్ పోటీలలో రేణిగుంట బాలికోన్నత పాఠశాల విద్యార్థినులు ప్రథమ బహుమతిని సాధించిన కమిషనర్ మౌర్య చేతుల మీదుగా రూ.10వేలు నగదు పురస్కారాన్ని అందుకున్నారు.

రేణిగుంట జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో సర్వశిక్ష ఆధ్వర్యంలో ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ విద్యను 2013వ సంవత్సరం నుంచి ప్రత్యేకంగా నడుపుతున్నారు. ఇక్కడ క్రాఫ్ట్ టీచర్ ప్రమీల విద్యార్థినులలో దాగి ఉన్న సహజ సామర్థ్యాలకు పదును పెడుతూ ఆరవ తరగతి నుంచి 9వ తరగతి వరకు విద్యార్థులకు ప్రతిరోజూ ప్రత్యేక తర్ఫీదునిస్తున్నారు.

ప్రశంసలు:

గత నెలలో తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్‌లో నిర్వహించిన జిల్లాస్థాయి వేస్ట్ టూ వండర్ పోటీల్లో రేణిగుంట బాలికోన్నత పాఠశాల విద్యార్థినులు వేస్ట్ మెటీరియల్‌తో తయారు చేసిన బొమ్మలు ప్రదర్శనకు పెట్టారు. ఈ పోటీల్లో వీరు తయారు చేసిన బొమ్మలు వీక్షకులను ఆకట్టుకున్నాయి. దీంతో మొదటి బహుమతితోపాటు రూ.10వేల నగదు పురస్కారం అందుకున్నారు. గతంలో పలు అవార్డులు, రివార్డులను వీరి ప్రావీణ్యానికి దక్కింది. గత ఏడాది న్యూఢిల్లీ, ఉత్తరాఖండ్ రాష్ట్రాల నుంచి ఆయా రాష్ట్రాల ఎస్‌సీఈఆర్‌టీలచే ప్రత్యేక బృందాలు ఈ స్కూల్‌ను సందర్శించి విద్యార్థినులు రూపొందించిన ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ బొమ్మలు విశేషంగా ఆకట్టుకున్నట్లు సంభ్రమాశ్చర్యాలను వ్యక్తం చేశారు. మనం వాడి పారేసే వస్తువులతో చూడచక్కని రీతిలో బొమ్మలు తయారు చేయడం పట్ల విద్యార్థులలో దాగి ఉన్న సృజనాత్మకతను వారు ప్రశంసించారు.

వ్యర్థాలకు పరమార్థం

మనం వాడి పడేసే ఐస్‌క్రీమ్ పుల్లలు, టీ కప్పులు, ప్లాస్టిక్ స్పూన్లు, కూల్‌డ్రింక్ తాగే పుల్లలు, కర్రపుల్లలు, వాటర్ బాటిళ్లతో వివిధ రకాల బొమ్మలను తయారుచేసి వాటిని పెయింటింగ్‌తో అందమైన హస్త కళల ఉత్పత్తులుగా రూపొందిస్తున్నారు. ఆసక్తి ఉన్న పిల్లలందరికీ ఇలాంటి కుట్లు, అల్లికలు, బొమ్మల తయారీ, పెయింటింగ్ విధానాన్ని మెళకువలతో నేర్పుతున్నారు. విద్యార్థులు ప్రత్యేక శ్రద్ధ వహించి వ్యర్థ పదార్థాలను ఉపయోగించి బొమ్మలను తయారు చేసి పాఠశాల తరగతి గదుల్లో ప్రదర్శిస్తున్నారు.

ఎంతో ఆసక్తిగా నేర్చుకుంటున్నాం..



ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ టీచర్ పర్యవేక్షణలో మేము వేస్ట్ మెటీరియల్‌తో చూడచక్కని రీతిలో బొమ్మలు, అలంకరణ సామగ్రిని తయారుచేస్తున్నాం. ఎంతో ఆసక్తిగా నేర్చుకుంటున్నాం. ఈ ప్రావీణ్యం మాకు భవిష్యత్తులో ఉపయోగపడుతుంది. మా స్కూల్‌కు జిల్లా స్థాయి ప్రథమ స్థానం రావడం సంతోషంగా ఉంది.

- సి.సౌమ్యశ్రీ, బాలికోన్నత పాఠశాల, రేణిగుంట

ఎంతో సంతోషకరం



మా పాఠశాలలో పనిచేస్తున్న క్రాఫ్ట్ టీచర్ జె.ప్రమీల గైడెన్స్‌తో విద్యార్థినులు ఉపయోగం లేని వస్తువులను వినియోగించి సుందరమైన బొమ్మలుగా తీర్చిదిద్దుతున్నారు. మా పాఠశాల విద్యార్థినులు తిరుపతి కార్పొరేషన్ ఆధ్వర్యంలో జరిగిన జిల్లా స్థాయి పోటీలో ప్రథమ బహుమతిని తీసుకురావడం ఎంతో గర్వకారణం.

- విష్ణువర్ధనం, హెచ్ఎం, బాలికోన్నత పాఠశాల, రేణిగుంట

విద్యార్థినులు చక్కగా నేర్చుకుంటున్నారు



మా స్కూల్లో విద్యార్థినులు ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ విద్యను ఎంతో ఆసక్తితో నేర్చుకుంటున్నారు. వారి పడేసిన పనికిరాని వస్తువులను ఉపయోగించి మా పిల్లలు తయారు చేసిన వస్తువులకు జిల్లా స్థాయి ప్రథమ బహుమతి దక్కడం సంతోషంగా ఉంది. ముమ్ముందు మరింత గొప్పగా వస్తువులను తయారు చేయిస్తాం.

- జె.ప్రమీల, ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ టీచర్, బాలికోన్నత పాఠశాల





బాలికోన్నత పాఠశాల విద్యార్థినులు తయారు చేసిన బొమ్మలు

భవన నిర్మాణ కార్మికుల ధర్నా

నారాయణవనం: ఇసుక కొరతతో పనులు లేక కుటుంబ పోషణ భారమైందని భవన నిర్మాణ కార్మికులు వాపోయారు. వారు గురువారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి శ్రీరాములు మాట్లాడుతూ జిల్లాలో ఇసుక కొరత ఎక్కువగా ఉందన్నారు. దీంతో నిర్మాణ పనులు ఆగిపోయాయని తెలిపారు. దీంతో మేస్త్రీలు, కూలీలు, ఎలక్ట్రీషియన్లు, ప్లంబర్లు పనులు లేక ఇబ్బంది పడుతున్నట్టు వివరించారు. కూటమి నేతలు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న 40 వేల భవనాల బిల్లులను సకాలంలో చెల్లించి కార్మికులను ఆదుకోవాలని కోరారు. 11వ తేదీన నిర్వహించే చలో కలెక్టరేట్‌లో కార్మికులు భారీ సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం కార్యాలయ ఏవో శ్రీధర్‌రాజుకు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కౌన్సిల్ సభ్యుడు మహేష్‌బాబు ఏఐటీయూసీ నాయకులు చంద్రబాబు, పురుషోత్తమరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అవగాహనతో కేన్సర్ దూరం


అవగాహన ర్యాలీని ప్రారంభిస్తున్న డాక్టర్ తేజస్విని


ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

రేణిగుంట: అవగాహనతో జాగ్రత్తలు తీసుకుంటే ప్రాణాంతక కేన్సర్ వ్యాధికి దూరంగా ఉండొచ్చని రేణిగుంట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ తేజస్విని అన్నారు. జాతీయ కేన్సర్ అవగాహన దినోత్సవం పురస్కరించుకుని గురువారం రేణిగుంట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి పీహెచ్‌సీ సిబ్బంది అవగాహన ర్యాలీ నిర్వహించారు. పట్టణంలోని ప్రధాన వీధుల్లో ప్లకార్డులను ప్రదర్శిస్తూ నినాదాలు చేసుకుంటూ ర్యాలీ చేశారు. ఎంపీహెచ్‌ఓ నాగరాజు, సబ్‌యూనిట్ ఆఫీసర్ వెంకటయ్య, మునిసుబ్బరామిరెడ్డి, హెల్త్ సూపర్‌వైజర్లు శివకుమార్, జైబూన్‌బి, హెల్త్ అసిస్టెంట్ భువనగిరి పాల్గొన్నారు.

కేన్సర్‌పై అవగాహన అవసరం


బుచ్చినాయుడుకండ్రిగ : కేన్సర్‌పై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని మండల వైద్యాధికారి దివాకర్ తెలిపారు. ప్రపంచ కేన్సర్ నివారణ దినోత్సవం సందర్భంగా గురువారం బుచ్చినాయుడు కండ్రిగలో వైద్యసిబ్బంది, ఆశా కార్యకర్తలు ర్యాలీ నిర్వహించారు. సీహెచ్‌ఓ వెంకటేశ్వర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

కళాశాలలో కేన్సర్‌పై అవగాహన

శ్రీకాళహస్తి: జాతీయ కేన్సర్ అవగాహన సదస్సు జరిగింది. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ బి.రాజశేఖర్ అధ్యక్షతన ఈ కార్యక్రమం నిర్వహించారు. శ్రీ వేంకటేశ్వర ఇన్‌స్టిట్యూట్ ఫర్ కేన్సర్ కేర్ అండ్ అడ్వాన్స్ రీసెర్చ్ నుంచి టాటా కేన్సర్ కేర్ ట్రస్టు, వే ఫౌండేషన్, మహిళా సాధికారత విభాగం నుంచి వచ్చిన నిపుణులైన డాక్టర్లు సిబ్బంది విద్యార్థులకు కేన్సర్‌పై అవగాహన కల్పించారు. కళాశాల సిబ్బందికి స్క్రీనింగ్ టెస్టులు చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన ర్యాలీలో విద్యార్థులు, వైద్యులు, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు. వే ఫౌండేషన్ వ్యవస్థాపకులు డాక్టర్ పైడి అంకయ్య, టాటా కేన్సర్ కేర్ ఫౌండేషన్ డాక్టర్లు డా.పి.వి.హేమంత్‌కుమార్, డా.పి.వెంకయ్యబాబు, డా.రెడ్డి కుమారి, డా.కె.మహేంద్ర, బి.అమరావతి పాల్గొన్నారు.

కేన్సర్‌పై విజయం స్క్రీనింగ్‌తోనే సాధ్యం

శ్రీకాళహస్తి: పట్టణంలోని శ్రీరామ్ నగర్ కాలనీ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నేషనల్ కేన్సర్ అవేర్‌నెస్ డే సందర్భంగా గురువారం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ బాలు, సిబ్బందితో కలసి ర్యాలీ నిర్వహించారు. ఆయుర్వేద డాక్టర్ శైలజ, ఆస్పత్రి సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు


ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

చంగల్‌రాయస్వామి గ్రామోత్సవం


పురవీధుల్లో ఊరేగుతున్న వళ్లిదేవసేన సమేత చంగల్రాయస్వామి

శ్రీకాళహస్తి: స్కంధషష్టిని పురస్కరించుకొని గురువారం చంగల్రాయస్వామికి గ్రామోత్సవం నిర్వహించారు. శ్రీకాళహస్తీశ్వరా ఆలయంలోని అలంకార మండపంలో వళ్లీ దేవసేన సమేత చంగల్రాయస్వామి అమ్మవారిని అలంకరించి. పంచహారతులు సమర్పించి. గ్రామోత్సవం నిర్వహించారు. ఆలయ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు. పురవీధుల్లో అర్ధచంద్రుడి వెలుగుల్లో నాలుగు మాడ వీధుల్లో ఏర్పాటు చేసిన శ్రీ, కాళ, హస్తి ప్రతిమలతో కూడిన దీపాలు దేదీప్యమానంగా వెలిగిపోతున్నాయి.

పరశురామేశ్వరుని సేవలో పెదకూరపాడు ఎమ్మెల్యే

ఏర్పేడు(రేణిగుంట): ఏర్పేడు మండలం గుడిమల్లంలోని శైవక్షేత్రమైన శ్రీ పరశురామేశ్వరస్వామి ఆలయాన్ని పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ గురువారం దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ మా జీ చైర్మన్ బత్తల గిరిబాబునాయుడు, ఈఓ రామచంద్రారెడ్డి స్వాగతం పలికి స్వామి అమ్మవార్ల వద్ద ప్రత్యేక పూజలు చేయించారు. దర్శనానంతరం వినాయక మండపం వద్ద వారికి వేద పండితుల ఆశీర్వాదమిచ్చా రు. స్వామి అమ్మవార్ల తీర్థప్రసాదాలు, చిత్రపటా న్ని బహూకరించారు. కార్యక్రమంలో ఆర్టీఓ ప్రసాద్, నవీన్, స్వర్ణ, హరి, బత్తల బాబు నాయుడు, భాష్యం అఖిల్ పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయుడికి సత్కారం


సురేష్‌ను సన్మానిస్తున్న డీఈఓ

శ్రీకాళహస్తి రూరల్: మండలంలోని ఊరందూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న జాతీయ ఉత్తమ ఉపాధ్యాయుడు కూనాటి సురేష్‌ను గురువారం సన్మానించారు. తిరుచానూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన జిల్లా స్థాయి రిసోర్స్ పర్సన్స్ శిక్షణ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి కేవీఎస్ కుమార్ ప్రశంసించి సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా పరీక్షల బోర్డు సెక్ర టరీ వంశీ రాజా, సైన్స్ జిల్లా కోఆర్డినేటర్ నీలకంఠ, జిల్లా ఆంగ్ల రిసోర్స్ పర్సన్ భాగ్యశేఖర్, గణిత రిసోర్స్ పర్సన్ మురళి, తెలుగు రిసోర్స్ పర్సన్ కిట్టన్న పాల్గొన్నారు.

క్యారీ బాక్సుల వితరణ


స్వీట్లు, క్యారీ బాక్సులను అందజేస్తున్న పీఓ సాగర్

ఏర్పేడు(రేణిగుంట): ఏర్పేడు మండలం మేర్లపాక పంచాయతీ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు గురువారం మేర్లపాక సమీపంలో ఉన్న పుష్పిత్ స్టీల్స్ కర్మాగారం సౌజన్యంతో విద్యార్థులకు స్వీట్లు, క్యారీ బాక్సులు వితరణగా అందజేశారు. కర్మాగారం పీఓ సాగర్, సర్పంచ్ కే.గంగాధర్, ఎంపీటీసీ భరత్‌కుమార్, నరసింహనాయుడు, బట్టి మస్తాన్, చంద్రశేఖర్, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్ లావణ్య, లలిత, ఫ్యాక్టరీ ఉద్యోగులు పాల్గొన్నారు.

నలుగురిపై హత్యాయత్నం కేసు నమోదు

శ్రీకాళహస్తి : శ్రీకాళహస్తి రెండో పట్టణ పరిధిలో బుధవారం విష్ణువర్ధన్ అనే వ్యక్తిపై జరిగిన హత్యాయత్నం కేసులో నలుగురిపై కేసు నమోదు చేసినట్లు సీఐ వెంకటేశ్వర్లు తెలిపారు. పుట్టినరోజు సందర్భంగా బుధవారం రాత్రి కేక్ కట్ చేస్తున్న విష్ణువర్ధన్‌పై వాసు, ముని, భరత్ సహకారంతో జగన్ కేక్ కోసిన కత్తితోనే పొడిచాడు. పాతకక్షల నేపథ్యంలోనే ఈ గొడవ జరిగినట్టు సీఐ తెలిపారు.

ఉల్లాస్‌తో వయోజన విద్య


ఉల్లాస్‌పై అవగాహన కల్పిస్తున్న ఎంపీడీవో ఎస్.చంద్రశేఖర్

సత్యవేడు : ప్రతి ఒక్కరూ చదవడం, రాయడం నేర్చుకునేందుకుగాను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉల్లాస్ కార్యక్రమం ద్వారా వయోజన విద్యా విధానాన్ని అమలుచేస్తున్నట్టు ఎంపీడీఓ ఎస్.చంద్రశేఖర్ తెలిపారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం వలంటరీ టీచర్లకు ఒక్క రోజు శిక్షణ ఇచ్చారు. రిసోర్సుపర్సన్ బాలకృష్ణ, ఏపీఎం డాంగే యాదవ్, ఎంఈవోలు కే.రవి, ఉష, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ చెంచులక్ష్మి, మండల సమాఖ్య అధ్యక్షురాలు కోటేశ్వరి పాల్గొన్నారు.

వలంటీర్ టీచర్లకు శిక్షణ

బుచ్చినాయుడుకండ్రిగ: మండల కేంద్రమైన బుచ్చినాయుడుకండ్రిగలోని ఐకేపీ కార్యాలయంలో గురువారం ఎంపీడీఓ త్రివిక్రమ్‌రావు ఆధ్వర్యంలో నవ భారత్ ఉల్లాస్ కార్యక్రమంపై అవగాహన కల్పించారు. ఇందుకోసం ముందుకొచ్చిన వలంటీర్ టీచర్లకు ఎంఈవోలు రవీంద్రనాథ్, మునిసుబ్రమణ్యం శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఏపీఎం మునెయ్య, సీసీలు పాల్గొన్నారు.

సామాజిక పరిస్థితులపై అవగాహన కలిగి ఉండాలి

నారాయణవనం: మహిళలు సామాజిక పరిస్థితులపై అవగాహన కలిగి ఉండాలని ఇన్‌చార్జ్ ఎంపీడీఓ గుణశేఖర్ తెలిపారు. స్థానిక స్త్రీశక్తి భవన్‌లో గురువారం ఉల్లాస్ (అండర్ స్టాండింగ్ ఆఫ్ లైఫ్ లాంగ్ లెర్నింగ్ ఫర్ ఆల్ ఇన్ సొసైటీ) కార్యక్రమంలో భాగంగా ఒక్కరోజు శిక్షణ ఇచ్చారు. ఎంఈఓ ప్రభాకర్ రాజు క్రాంతి పథం డీపీఎం వెంకటేశ్వర్లు, ఏపీఎం మమత, సీసీలు, సంఘమిత్రలు పాల్గొన్నారు.

కోలాహలం..మహాకుంభాభిషేకం


ఆలయంపై కలశాలను ప్రతిష్ఠించిన అర్చకులు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయ అనుబంధ దేవాలయమైన ఏడు గంగమ్మల దేవాలయంలో మహాకుంభాభిషేకం పూజలు గురువారం ప్రారంభమయ్యాయి. ఈసందర్భంగా మొదటి రోజు ఏడు గంగమ్మల విగ్రహస్థాపన, కలశస్థాపన కార్యక్రమం దేవస్థానం నిర్వహించింది. కార్యక్రమంలో శ్రీకాళహస్తీశ్వరస్వామి వారి దేవస్థానం మాజీ ధర్మకర్తల మండలి అధ్యక్షుడు అంజూరు తారక శ్రీనివాసులు, ఆలయ అధికారులు లక్ష్మయ్య, ఏఈ వేణుగోపాల్, వర్క్ ఇన్‌స్పెక్టర్ సూర్య ప్రసాద్, బాలాజీ, సపతి కుమార్, అర్చకులు గోపి, పరమేష్, ఏడు గంగమ్మల కమిటీ గౌరవాధ్యక్షుడు అంజూరు బాలసుబ్రమణ్యం, ఏడు గంగమ్మల కమిటీ అధ్యక్షుడు స్వర్ణమూర్తి, షణ్ముఖం, మొగరాల గణేష్, జలకం కిషోర్, నాథముని, శంకర్, విజయ్‌కుమార్, లక్ష్మీపతి, బాల, సుధాకర్, మునికుమార్ పాల్గొన్నారు.

గురుకుల విద్యార్థుల ప్రతిభ


విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపల్ ఎస్.శ్రీనివాసులు

సత్యవేడు: మహారాష్ట్రలోని ఔరంగబాద్‌లో ఉన్న కళాభారతి చైల్డ్ ఆర్ట్స్ ఇన్‌స్పిరేషన్ నేషనల్ హ్యాండ్ రైటింగ్ కాంపిటీషన్, ఆల్ ఇండియా సిటిజన్స్ డెవలప్‌మెంట్ సెంటర్‌లో నిర్వహించిన డ్రాయింగ్, వ్యాసరచన పోటీల్లో సత్యవేడు గురుకుల పాఠశాల విద్యార్థులు బంగారు పతకాలు సాధించారు. వారిలో కే.రాజశేఖర్(9వ తరగతి), ఎస్.ఇనియాన్ (8వ తరగతి), కే.చైతన్య (9వ తరగతి) ఉన్నారు. వారిని గురువారం పాఠశాల ఆవరణలో ప్రిన్సిపల్ ఎస్.శ్రీనివాసులు ఈసందర్భంగా అభినందించారు. కార్యక్రమంలో డ్రాయింగ్ మాస్టర్ జి.సురేష్ బాబు, బి.సురేష్‌కుమార్, కె.మల్లికార్జున, వై.నాగార్జున పాల్గొన్నారు.

భద్రతా నిబంధనలు పాటించాలి


మాట్లాడుతున్న శ్రీసిటీ డీఎస్పీ పైడేశ్వరరావు

శ్రీసిటీ (వరదయ్యపాళెం) : శ్రీసిటీ పారిశ్రామికవాడ పరిధిలో వివిధ వాహనాలు నడిపే యజమానులు భద్రతా ప్రమాణాలను తప్పక పాటించాలని శ్రీసిటీ హైటెక్ పోలీస్‌స్టేషన్ డీఎస్పీ పైడేశ్వరరావు తెలిపారు. ఆయన గురువారం శ్రీసిటీ పరిధిలో వాహనాలు నడిపే వివిధ ట్రాన్స్‌పోర్ట్ యజమానులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. శ్రీసిటీ వైస్ ప్రెసిడెంట్ రమేష్ కుమార్, సెక్యూరిటీ జీఎం రమేష్, సీఐ బీవీ శ్రీనివాసులు, ఎస్ఐ హరిప్రసాద్, జీఎస్‌వో కోటేశ్వరరావు పాల్గొన్నారు.